క్లుప్తంగా

అక్షయపాత్ర సేవలు అభినందనీయం



మంగళగిరి: ప్రభుత్వ పాఠశాలలకు నాణ్యమైన భోజనం అందిస్తున్న అక్షయ పాత్ర సేవలు అభినందనీయమని గుడివాడ ఎమ్మెల్యే వెనిగళ్ల రాము అన్నారు. ఆదివారం తెనాలి రోడ్డులో ఉన్న అక్షయ పాత్ర కార్యాలయాన్ని ఎమ్మెల్యే సందర్శించి, కిచెన్‌ను పరిశీలించారు. నాలుగు గంటల్లో లక్ష మందికి ఆహారం తయారు చేయడం ప్రశంసనీయమన్నారు. ఇటీవల వరదల సమయంలో 16 లక్షల మందికి భోజనం అందించినట్లు నిర్వాహకులు ఎమ్మెల్యేకు తెలిపారు. అన్న క్యాంటీన్లు ద్వారా రోజుకు 40 వేల మందికి భోజనం అందిస్తున్నట్లు చెప్పారు. అక్షయ పాత్ర వంశీధర్ దాసు తదితరులు ఉన్నారు.

అండర్ పాస్ నిర్మాణానికి వినతి



మంగళగిరి: నగర పరిధిలోని జాతీయ రహదారి వద్ద చినకాకాని రాజ్ కమల్ రోడ్డులో అండర్ పాస్ నిర్మించాలని రైతులు కోరుతున్నారు. ఈ మేరకు ఆదివారం గుంటూరులోని ఎంపీ, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ కార్యాలయానికి వెళ్లి వినతి పత్రం అందేశారు. రైతు నాయకులు పోతినేని వెంకటేశ్వరరావు, మన్యం శ్రీనివాసరావు, యార్లగడ్డ వెంకటేశ్వరరావు, పొన్నెగంటి కొండలరావు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



తాడేపల్లిరూరల్ : ఎంటీఎంసీ పరిధిలోని ఉండవల్లిలో ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం నిర్వహించారు. గుంటూరు కమిటీ అధ్యక్షుడు రౌతు శ్రీనివాసరావు మార్గశిర మాసం ఎంతో పవిత్రమైనదని తెలిపారు. దైవ భక్తితో గ్రంథ పఠనం, జ్ఞానం ఉండాలని ప్రబోధించారు. అనంతరం భగవద్గీత గ్రంథాలు పంపిణీ చేశారు. టీవీ కృష్ణారావు, బి. శివలింగం నాయక్, టి. బ్రహ్మం, పట్టాభి శ్రీను, జె.హరిబాబు, సుబ్బారావు, ఆదర్శ్, బి.విద్య, ఎస్కే దిల్‌షా, జయలక్ష్మి పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లుల దహనం



తాడేపల్లిరూరల్ : రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను ఉపసంహరించుకోవాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం ఉండవల్లిలోని అంబేడ్కర్ నగర్‌లో విద్యుత్ బిల్లులను దహనం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.రవి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో విద్యుత్ ఛార్జీలను పెంచం అని చెప్పి ఇప్పుడు మాట తప్పిందన్నారు. నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలతో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే ఇప్పుడు విద్యుత్ చార్జీల భారాన్ని ప్రజలపై మోపడం సరికాదని పేర్కొన్నారు. పెంచిన విద్యుత్ చార్జీలను తక్షణం ఉపసంహరించుకోవాలని కోరారు. సీపీఎం రాజధాని డివిజన్ నాయకులు వల్లభాపురం వెంకటేశ్వరరావు, సంకురు ఇమ్మానియేలు రాజు, కంచర్ల శేషయ్య, బి. కోటేశ్వరరావు, ఓలేటి రమేష్, కె. సూరిబాబు పాల్గొన్నారు.

విజ్ఞాన సర్వస్వం భగవద్గీత

తెనాలి: భగవద్గీత ఒక మతగ్రంథం కాదనీ, అది విజ్ఞాన సర్వస్వమని, వ్యక్తిత్వ వికాస పాఠమని ప్రముఖ ఆధ్యాత్మిక ఉపన్యాసకుడు బీకేఎస్ మూర్తి అన్నారు. భగవద్గీత నరనారాయణుల సంవాదంగా, గురుశిష్యుల సంవాదంగానూ వెల్లడించారు. అందులోని 12వ అధ్యాయం భక్తిభావాన్ని తెలియజేస్తుందనీ చెప్పారు. అందుకే ప్రపంచంలోని పలు దేశాల ప్రజలు భగవద్గీతను తెలుసుకుంటున్నారని వివరించారు. వాకర్స్ క్లబ్, తెనాలి సమావేశం ఆదివారం సాయంత్రం స్థానిక కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు గుత్తా వెంకటరత్నం అధ్యక్షత వహించారు. కార్యదర్శి కడియాల రవిబాబు స్వాగతం పలికిన సభలో సభ్యులు ఆనందయ్య, వెంకటేశ్వరరావు, మొవ్వా సత్యనారాయణ, రంగారావు, రాజేంద్రప్రసాద్, చేతన్‌రాజ్ పాల్గొన్నారు.

రుచికే మినరల్..

- కొంటున్నది శుద్ధి నీరని తెలిసేదెలా..?
- ఐఎస్‌ఐ గుర్తింపు లేని ప్లాంట్లు కోకొల్లలు
- రుచి కోసం కెమికల్స్ కలపడంతో ప్రజలకు రోగాలు
- చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం



అరకొరగా శుద్ధి చేసిన నీటిని క్యాన్లలో సరఫరా చేస్తున్న దృశ్యం

మేడికొండూరు: మనిషి మనుగడకు అవసరమయ్యే నీటి వ్యాపారం జోరుగా సాగుతోంది. పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న మినరల్ వాటర్ ప్లాంట్లే ఈ వ్యాపారం ఎంత లాభసాటో.. చెప్పకనే చెబుతున్నాయి. కానీ, డబ్బు పెట్టి కొంటున్న వాటర్‌లో మినరల్స్ ఉంటున్నాయా..?..అసలు మనం తాగుతున్నవి శుద్ధి చేసిన నీరేనా..? రుచి కోసం కెమికల్స్ కలుపుతున్నారా..? వంటి ప్రశ్నలకు సమాధానాలు దొరకవు. వాటిని పర్యవేక్షించాల్సిన అధికారులూ.. ఎలాంటి చర్యలు తీసుకోరు.

మేడికొండూరులో ఇలా..

ఐఎస్‌ఐ అనుమతి పొందని వాటర్ ప్లాంట్లు మేడికొండూరు మండలంలోనే 50కు పైగా ఉన్నాయి. ప్రమాణాలకు అనుగుణంగా ప్లాంట్‌లలో సరఫరా అవుతున్న నీటిలో ఫ్లోరిన్ శాతం ఏంత, నీటికి అను సంధానం చేసిన బావి, బోరు ఉన్న ప్రదేశాల్లో పరిస్థితి ఏమిటీ? నీరు రుచి కోసం కెమికల్స్ ఏమైనా కలుపుతున్నారా..? అనే వాటిని అధికారులు పరీక్షించడం లేదన్న విమర్శలు స్పష్టంగా వినిపిస్తున్నాయి. దీంతో వాటర్ ప్లాంటు నిర్వాహకులు కూడా వ్యాపారాన్ని విచ్చలవిడిగా సాగిస్తున్నారు. కొంత మంది వ్యాపారులు క్యాన్ వాటర్ ఏక్కువగా అమ్ముడు పోతాయనే ఉద్దేశంతో నీటి రుచి కోసం కెమికల్స్ కలిపి ప్రజల అనారోగ్యాలకు కారణమవుతున్న సందర్భాలూ లేకపోలేదు.

ఈ నిబంధనలు ఎవరు పాటిస్తున్నారు..?

ఒక వాటర్ ప్లాంటు పెట్టాలంటే తప్పనిసరిగా ఐఎస్‌ఐ అనుమతి పత్రం పొందాలి. ప్లాంట్ చుట్టూ మురుగు నీరు, వ్యర్థాలు లేకుండా చూసుకోవాలి. యంత్రాల విషయంలో నిబంధనలు తూచ తప్పకుండా పాటించాలి. ఇవన్నీ పాటిస్తేనే మినరల్ వాటర్ ప్లాంటు పెట్టడానికి అర్హత లభిస్తుంది. కానీ, ప్రస్తుత జరుగుతుండేది మాత్రం.. తక్కువ పెట్టుబడితో నాసి రకం యంత్రాలతో బావులు, బోర్లను వేసి ఆ నీటితో యథేచ్ఛగా వ్యాపారం కొనసాగిస్తున్నారు.



నీటిని శుద్ధి చేసే యంత్రం

నీరు తాగేప్పుడు జాగ్రత్తలు పాటించాలి



కెమికల్స్ కలిపిన నీరు తాగేందుకు బాగానే ఉంటుంది. కానీ, ఆ ప్రభావం లివర్, కిడ్నీ, గుండె మీద పడుతుంది. తద్వారా మనిషి ఆయుప్రమాణం తగ్గిపోతుంది. మార్చి నుంచి మే వరకు తప్పనిసరిగా బోరు నీటిని శుద్ధి చేసుకొని, గోరు వెచ్చ మరిగించి తాగాలి.

– టి.అనిరుధ్, వైద్యుడు, పీహెచ్‌సీ, మేడికొండూరు.

ఆర్గనైజేషన్‌కు గుర్తింపు ఇవ్వండి

మాల ఉద్యోగుల ఐక్యవేదిక నాయకులు



ఐక్య వేదికపై నాయకులు

తాడేపల్లిరూరల్ : మాలల ఆర్గనైజేషన్‌కు గుర్తింపు ఇవ్వాలని మాల ఉద్యోగుల సంఘం నాయకులు మల్లెల వెంకటరావు, నూతలపాటి జగదీష్ కోరారు. ఆదివారం తాడేపల్లి బ్రహ్మానందపురంలో రాష్ట్ర మాల ఉద్యోగస్తుల ఐక్య వేదిక సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లెల వెంకటరావు, నూతలపాటి జగదీష్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో మాల కులానికి సంబంధించి 15 మంది ఎమ్మెల్యేలు, నలుగురు ఎంపీలు ఉన్నారన్నారు. వారి వల్ల తమకు ఉపయోగం లేదని, ఈ సమావేశానికి తమ ఎమ్మెల్యేలను, ఎంపీలను ఆహ్వానించామన్నారు. కానీ ఒక్కరూ రాలేదని, తాము ఓట్లు వేస్తే నెగ్గి, తమ సమస్యలపై మాట్లాడకుండా వారి ప్రాధాన్యతను తగ్గించుకున్నారన్నారు. ఎస్సీ ఎస్టీ ఉద్యోగులను ప్రభుత్వాలు వేధిస్తున్నాయని, తమ గళం వినిపించేందుకు ఎస్సీ ఎస్టీ ఆర్గనైజషన్స్‌కు గుర్తింపు ఇవ్వకుండా చేస్తున్నారని ఆరోపించారు. ఉద్యోగాల ప్రమోషన్‌లో తమ వాటాలు తమకు ఇవ్వకుండా వేరే వారికి ఇస్తున్నారని, ఇదేమని ప్రశ్నించిన ఎస్సీ ఉద్యోగులను సస్పెండ్ చేసి ఏసీబీ ట్రాప్ చేసి వేధిస్తున్నారని మండిపడ్డారు. ఏసీబీ రైడ్‌లు కేవలం ఒక్క ఎస్సీ వర్గ ఉద్యోగులపై మాత్రమే జరుగుతున్నాయని, మిగతా వర్గాలపై ఎందుకు జరగవని ప్రశ్నించారు.

రోడ్లను కంపు చేస్తున్నారు



తెనాలి రహదారి వెంబడి మలమూత్రాలను వదులుతున్న సెప్టిక్ ట్యాంకర్

- ఇష్టారాజ్యంగా సెప్టిక్ ట్యాంక్ నిర్వాహకులు
- ఎక్కడ పడితే అక్కడ రోడ్డు పక్కన మల మూత్రాల డంప్
- దుర్వాసనతో అల్లాడిపోతున్న వాహనదారులు
- మంగళగిరిని కంపు చేస్తున్నా.. పట్టించుకోని కార్పొరేషన్ అధికారులు



ట్యాంకర్ వాల్ విప్పదీస్తున్న నిర్వాహకుడు

తాడేపల్లిరూరల్ : మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని సెప్టిక్ ట్యాంక్‌ల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఎక్కడ పడితే మల మూత్రాలను ట్యాంకర్లలో తీసుకొచ్చి ఇక్కడ వదులుతున్నారు. ఆదివారం నిత్యం రద్దీగా ఉండే తెనాలి మంగళగిరి రహదారిలోని ఆత్మకూరు అక్షయ పాత్ర మధ్య ప్రాంతంలో రెండు ట్యాంకర్ల నిర్వాహకులు ఎక్కడి నుండో సెప్టిక్ ట్యాంక్‌లోని మల మూత్రాలను రోడ్డువెంబడి వదిలి వెళ్లిపోయారు. ఒక్క తెనాలి రహదారికే అది పరిమితం కాలేదు. రేవేంద్రపాడు, ఉండవల్లి సెంటర్ రోడ్డు, ప్రాతూరు రహదారి, రేపల్లె కరకట్ట, నిడమర్రు రోడ్డు, కాజా రైల్వే ట్రాక్ డొంక రోడ్డు ప్రాంతాల్లో ఏదో ఒక సమయంలో సెప్టిక్ ట్యాంక్ నిర్వాహకులు మల మూత్రాలను వదిలివేసి వెళుతున్నారు. దీంతో తీవ్రమైన దుర్వాసన వచ్చి ఆ రహదారిలో ప్రయాణించలేకపోతున్నామని వాహన చోదకులు వాపోతున్నారు. ఇప్పటికైనా కార్పొరేషన్ అధికారులు సెప్టిక్ ట్యాంకర్ల యజమానులతో సమావేశం ఏర్పాటు చేసి, వ్యర్థాలను ఎక్కడ డంప్ చేయాలో సూచించాలని పలువురు కోరుతున్నారు.

సుందర తెనాలి కలను సాకారం చేస్తాం

మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న



సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్ శేషన్న

తెనాలిఅర్బన్: సుందర తెనాలి కలను సాకారం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పేర్కొన్నారు. పట్టణంలోని 15వ వార్డు గౌడకాలనీ, గురవయ్య కాలనీలో ఆదివారం ఆయన పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుధ్య నిర్వహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. రోడ్లపై అక్కడక్కడ మట్టి దిబ్బలు ఉండటతో వాటిని వెంటనే తొలగించాలని ఆదేశించారు. ప్రతి రోజు చెత్తను నూరుశాతం సేకరించాలని సూచించారు. వైఎస్సార్ సీపీ 15వ వార్డు కౌన్సిలర్ గుంటూరు కోటేశ్వరరావు మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో చినరావూరు పార్కును ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు. పార్కులో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని, తన హయాంలో ఇవన్నీ పూర్తికావడం సంతోషకరమని చెప్పారు. పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

మాస్టర్ ప్రింటర్స్ అసోసియేషన్ సమావేశం

తెనాలి: ఏపీ మాస్టర్ ప్రింటర్స్ అసోసియేషన్, తెనాలి శాఖ ఆత్మీయ సమావేశం ఆదివారం కొత్తపేటలోని దేవీప్రియ ఫంక్షన్‌హాలులో నిర్వహించారు. సమావేశంలో ఎన్నికైన నూతన కమిటీని పరిచయం చేశారు. అసోసియేషన్ ఆర్థికంగా బలపడటానికి సభ్యుల సలహాలను తీసుకున్నారు. సంఘ సమస్యలపైనా చర్చించారు. అసోసియేషన్ అధ్యక్షుడు డి.అమరనాథ్, కోశాధికారి ఎస్‌వీ ఉమామహేశ్వరరావు సభ్యులకు ధన్యవాదాలు తెలియజేశారు.

విద్యార్థినులకు పుస్తకాలు, దుప్పట్లు పంపిణీ



తెనాలి: పట్టణంలోని కాలేజీ విద్యార్థినుల వసతిగృహంలోని విద్యార్థినులకు తెనాలి నియోజకవర్గ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జొన్నాదుల వెంకటేశ్వరరావు నేతృత్వంలో ఆదివారం పుస్తకాలు, దుప్పట్లు, నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. బీసీ సంక్షేమ వసతిగృహాల్లోని విద్యార్థుల సంక్షేమం కోసం గత ఏడేళ్లుగా సాయం అందచేస్తున్నట్లు ఈ సందర్భంగా చెప్పారు. జొన్నాదుల రాహుల్, అతడి మిత్రబృందం పవన్‌కుమార్, ప్రతాప్‌రెడ్డి, చెన్నకేశవులు ఈ సేవలను అందిస్తున్నారు. ఆదివారం కార్యక్రమంలో జొన్నాదుల వెంకటేశ్వరరావు, మిత్రబృందం తోపాటు బీసీ వెల్ఫేర్ అధికారి వి.భిక్షాలు, జొన్నాదుల శివరామకృష్ణ, వసతిగృహం వెల్ఫేర్ అధికారి గద్దం సరోజిని, హరిప్రసాద్, కోటేశ్వరరావు, శివప్రసాద్, నందిపాటి ప్రసాద్ పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి

తాడికొండ: గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన తాడికొండ మండలం కంతేరు గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కంతేరు గ్రామానికి చెందిన కుచ్చూరి రాజేంద్ర(35) శనివారం రాత్రి 11 గంటల సమయంలో ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళుతున్న సమయంలో కంతేరు గ్రామ పరిధిలోని సీతాపతి గార్డెన్ సమీపంలోకి రాగానే గుర్తుతెలియని వాహనం ఢీకొని వెళ్లిపోయింది. ప్రమాదంలో రాజేంద్ర తలకు బలమైన గాయం కావడంతో యువకుడు అక్కడికక్కడే మృతిచెందాడు. బాధితుడు తల్లి కుచ్చూరి శివమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు ఎస్‌ఐ జోజి ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కె వాసు తెలిపారు.

పురుగుమందు తాగి వృద్ధురాలి మృతి

కడుపునొప్పి తాళలేక పురుగుమందు తాగి వృద్ధురాలు మృతి చెందిన ఘటన తాడికొండ మండల నిడుముక్కల గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నిడుముక్కల గ్రామానికి చెందిన వేల్పూరి మహాలక్ష్మి(88) కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతూ తట్టుకోలేక శనివారం పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా శనివారం రాత్రి మృతిచెందింది. మృతురాలి కుమారుడు వేల్పూరి లక్ష్మయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ జోజి ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కె వాసు తెలిపారు.

ప్రజలపై భారం మోపుతున్న కూటమి



నిరసన కార్యక్రమంలో పాల్గొన్న సీపీఎం నాయకులు

తాడేపల్లిరూరల్ : కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీల పెంపుతో ప్రజలపై భారం మోపుతోందని సీపీఎం తాడేపల్లి మండల కార్యదర్శి పల్లెకృష్ణ వ్యాఖ్యానించారు. ఆదివారం కుంచనపల్లిలో పెంచిన విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా విద్యుత్ బిల్లుల దహనం, నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. పల్లె కృష్ణ మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే అదనపు విద్యుత్ భారాలు మోపమని చెప్పి, ప్రజలపై అదనపు విద్యుత్ భారాలను కూటమి ప్రభుత్వం వేస్తోందని మండిపడ్డారు. గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పెంచిన విద్యుత్ బిల్లులకు తెలుగుదేశం ప్రభుత్వం బాదుడే బాదుడు అంటూ విమర్శించి, నేడు ప్రజలపై ట్రూ అప్ చార్జీల పేరుతో అదనపు భారం వేయడం సరికాదని అన్నారు. సీపీఎం కుంచనపల్లి గ్రామ రెండవ శాఖ కార్యదర్శి కాజా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసే కేంద్ర ప్రభుత్వ విధానాలను కూటమి ప్రభుత్వం కూడా అమలు చేస్తోందన్నారు. ఒక వైపు నిత్యావసర సరుకులు ధరలు పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతుంటే, విద్యుత్ ధరలు తగ్గించకపోగా, సర్దుబాటు చార్జీల పేరుతో గతంలో 2022, 23లో వాడిన విద్యుత్ వాడకానికి డబుల్ చార్జీల వేసి విద్యుత్ బిల్లులు కట్టమనడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు అమ్మిశెట్టి రంగారావు, బడుగు వెంకటేశ్వరరావు, కొండపల్లి హరీష్, సుబ్బారావు, బాకీ చిన్నబ్బాయి పాల్గొన్నారు.

మది దోచిన ‘అన్నమయ్య కీర్తనల గీతాంజలి’



గానాలాపన చేస్తున్న డాక్టర్ కె.పురుషోత్తమరావు

తెనాలి: దక్షిణ భారత దేశమంతటికీ తొలి వాగ్గేయకారుడు తాళ్లపాక అన్నమాచార్యుడు...సంస్కృత వేదాల్లోని సారాన్నంతా అలతి అలతి తెలుగు పదాలతో పాడి, జాతికి సందేశం అందించి కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీవేంకటేశ్వరస్వామిని ఆరాధించిన ద్రవిడాగమ సార్వభౌముడు అన్నమయ్య అని ప్రముఖ కవి పొన్నపల్లి గోపాలకృష్ణమూర్తి అన్నారు. పట్టణానికి చెందిన సాంస్కృతిక సంస్థ సంకీర్తన ఆధ్వర్యంలో 8వ వార్షికోత్సవ ‘అన్నమయ్య కీర్తనల గీతాంజలి’ ఆదివారం సాయంత్రం స్థానిక తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో నిర్వహించారు. పల్లవి, చరణాలతో కూడిన పాటకు ప్రాణంపోసి, స్పష్టమైన రూపాన్ని కల్పించి, సంకీర్తనా స్వరూపాన్ని ఆంధ్రజాతికి అనుగ్రహించిన అన్నమాచార్య పదకవితా పితామహుడైన విధానాన్ని గోపాలకృష్ణమూర్తి వివరించారు. సహచర గాయకులతో కలిసి అన్నమయ్య కీర్తనలను ఏటా గానంచేస్తూ ప్రజలకు వాటిలోని అర్థాన్నీ, పరమార్థాన్నీ వీనులవిందుగా వినిపిస్తున్న సంకీర్తన సంస్థను ఆయన అభినందించారు. ఆంధ్రప్రదేశ్ రవాణా, రోడ్లు, భవనాల ప్రిన్సిపల్ కార్యదర్శి కాంతిలాల్ దండే ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. సంకీర్తన వ్యవస్థాపకుడు డాక్టర్ కె.పురుషోత్తమరావుతో తన సాన్నిహిత్యాన్ని గుర్తు చేసుకుంటూ, ఆయన చేస్తున్న సంగీత కళాసేవను అభినందించారు. డాక్టర్ కె.పురుషోత్తమరావు, దివ్యశ్రీ, సుచరిత, శ్రీకాంతి ప్రాజ్ఞేశ్వర లక్ష్మి, రత్న ప్రియాంక, దేవీలలిత, వైష్ణవి, ఆంజనేయశాస్త్రి అన్నమాచార్య కీర్తనలను రాగయుక్తంగా శ్రావ్యంగా ఆలపించారు. ప్రేక్షకుల అభినందనలు అందుకున్నారు. ఆంజనేయశాస్త్రి, శ్రీనివాస్‌లు వయొలిన్‌పై, వెంకటేశ్వరరావు కీబోర్డ్, నాగప్రసాద్ తబలా, జగన్మోహిని మృదంగం, కుమార్‌బాబు వేణువు, లక్ష్మీశంకర్ మోర్సింగ్, కిషోర్ ఘటంపై వాయిద్య సహకారం అందించారు. డిజిటల్ స్క్రీన్‌పై ప్రదర్శించిన శ్రీవేంకటేశ్వరస్వామి చిత్రాలు ప్రత్యేకాకర్షణ. అన్నమాచార్య కీర్తనలు ప్రాచుర్యానికి కృషిచేస్తున్న గురువులు కొండపి వసుంధర, యల్లాప్రగడ జానకి, పొత్తూరి వెంకట ఆదిలక్ష్మి, కృత్తివెంటి కమల, సాల్లేటి శైలజ, గౌరావఝుల ఆంజనేయశాస్త్రిలను ఘనంగా సత్కరించారు. డాక్టర్ సుజాత స్వాగతం పలికారు. పొన్నపల్లి వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

తాడికొండ: అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని, కేసు నమోదు చేసి ఘటన తాడికొండ మండలం నిడుముక్కల గ్రామంలో జరిగింది. పోలీసుల వివరాల మేరకు..నిడుముక్కల గ్రామంలో తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా సంచరిస్తున్న తలతోటి శేషయ్య అనే వ్యక్తి వద్ద 66 మద్యం సీసాలు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. వైటల్ విస్కీ 10 క్వార్టర్లు, క్లాసిక్ బ్లూ 55 క్వార్టర్లు మద్యంతో పాటు అతని వద్ద ఉన్న రూ.800 నగదును సీజ్ చేసి ఎస్‌ఐ జోజి ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కె.వాసు తెలిపారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



నగర పరిధిలోని నిర్మల ఇంగ్లీషు మీడియం స్కూలులో శనివారం రాత్రి సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. నగర అడిషనల్ కమిషనర్ శకుంతల ముఖ్య అతిథిగా పాల్గొని, సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. విద్యార్థులను అభినందించి బహుమతులు ప్రదానం చేశారు. గుంటూరు సీఎస్‌ఏ ఫాదర్ శౌరీలు, ఫాదర్ జోషఫ్ రెడ్డి, డాక్టర్ వాస విజయ్‌కుమార్ క్రీస్తు సందేశాన్ని అందించారు. చిన్నారుల నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

– ఆత్మకూరు(మంగళగిరి)



ఆకట్టుకున్న చిన్నారుల ప్రదర్శనలు



సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న అడిషనల్ కమిషనర్ శకుంతల

శ్రమయేవ జయతే పురస్కారం ప్రదానం



తెనాలిఅర్బన్: పసుపులేటి కోటేశ్వరరావు, తులశమ్మ స్మారక కమిటీ వ్యవస్థాపకుడు తన్నీరు శివశంకర్ ఆధ్వర్యంలో ఫ్రెండ్స్ ఇంజినీరింగ్ వర్క్స్ అధినేత షేక్ మొహిద్దీన్, సెంట్రింగ్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు మట్టుపల్లి సాంబయ్యలకు శ్రమయేవ జయతే పురస్కారాలను గాంధీనగర్‌లోని ఇస్కాన్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆదివారం ప్రదానం చేశారు. ఈ సందర్భంగా తన్నీరు శివశంకర్ మాట్లాడుతూ వివిధ రంగాల్లో పనిచేస్తూ ఉన్నత స్థితికి చేరిన వారిని గుర్తించి అవార్డులు ప్రదానం చేస్తున్నామని తెలిపారు. మర్రెడ్డి బసివిరెడ్డి, ఈఎల్‌వీ అప్పారావు, డాక్టర్ తన్నీరు కళ్యాణ్‌కుమార్, పసుపులేటి మల్లికార్జునరావు, పసుపులేటి వినోద్, మాలేపాటి హేమకుమార్, గరికపాటి రామమోహనరావు, తదితరులు పాల్గొన్నారు.